సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



ఆస్పత్రిలో ప్లాంటేషన్ చేయాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట సీహెచ్‌సీలో ప్లాంటేషన్ చేయాలని జెడ్పీ సీఈవో ఉమారాణి సూచించారు.

విధుల్లో చేరిన డీఎస్పీ భీమాశర్మ



సిరిసిల్లక్రైం: సిరిసిల్ల డీఎస్పీగా ఆర్.భీమాశర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1995వ బ్యాచ్‌కు చెందిన భీమాశర్మ ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఎస్సై, సీఐగా పనిచేశారు. తెలంగాణ ట్రాన్స్‌కోలో డీఎస్పీగా పనిచేసి, సిరిసిల్ల డీఎస్పీగా బదిలీపై వచ్చారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.0/21.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అదాలత్‌లో సత్వర న్యాయం

- జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత

సిరిసిల్లటౌన్: లోక్ అదాలత్‌లను ఆశ్రయించే కక్షిదారులకు సత్వర న్యాయం దొరుకుతుందని జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా కోర్టుహాలులో ఇన్సూరెన్స్ కంపెనీలకు చెందిన అధికారులతో గురువారం కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. మార్చి రెండో శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడే అవకాశం ఉన్న కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాజీపడితే ఒనగూరే లాభాలు వివరించాలన్నారు. న్యాయసేవా సమితి సభ్యుడు చింతోజు భాస్కర్, వివిధ బీమా కంపెనీల ప్రతినిధులు, అడ్వకేట్స్ పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లా వ్యాప్తంగా మార్చి 15 వరకు వందశాతం పన్నులు వసూలు చేయాలని డీపీవో వీర బుచ్చయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యాలయంలోని రికార్డులను గురువారం పరిశీలించారు. జిల్లాలో రూ.5.56కోట్ల పన్నులు వసూలు చేయాలనే టార్గెట్ ఉండగా.. ఇప్పటికే రూ.4.97 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. తడి, పొడి చెత్తను కంపోస్టుషెడ్డు తరలించి ఎరువులు తయారు చేయాలని సూచించారు. పీఎం విశ్వకర్మ పథకానికి ఇప్పటికే 4వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎల్లారెడ్డిపేట మండలంలో 24 జీపీలకు 9జీపీలలో 64 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎంపీవో వజీర్, ఈవో దేవరాజు ఉన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న భాస్కర్

ముస్తాబాద్(సిరిసిల్ల): వరి రైతులు సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్ సూచించారు. ముస్తాబాద్, తుర్కపల్లి, ఆవునూర్ గ్రామాల్లో వరిపంటను గురువారం పరిశీలించి మాట్లాడారు. అధిక ఉష్ణోగ్రతలతో అగ్గితెగులు, బ్యాక్టీరియా, ఎండాకు తెగులు లక్షణాలు గమనించినట్లు తెలిపారు. కాండం తొలిచే పురుగు ఉంటే ఎకరాకు కార్బోఫురాన్ 3 సీజీ గుళికలు 10 లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 4జీ గుళికలు 4 కిలోలు 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలన్నారు. మొగిపురుగు నివారణకు 3జీ లేదా సేంద్రీయ గుళికలను యూరియాతో కలిపి వేయాలని తెలిపారు.

ఖనిజాల రవాణాపై నిఘా

- మైనింగ్ అధికారి రఘుబాబు



తనిఖీ చేస్తున్న మైనింగ్ అధికారి రఘుబాబు

సిరిసిల్ల: కంకర, ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ అధికారి రఘుబాబు హెచ్చరించారు. మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలను గురువారం ముమ్మరం చేశారు. వాహనదారులు విధిగా అనుమతి పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. అనుమతి పత్రాలు లేకుండా ఖనిజాలను తరలించే వాహనాలను గుర్తించి ఈనెలలో రూ.9.55లక్షల జరిమానాలు విధించినట్లు వివరించారు. రాయల్టీ చెల్లించకుండా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట విరుద్ధంగా ఎవరూ వ్యవహరించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సైదులు, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నీళ్లు వచ్చేదెప్పుడో?

- సాగునీటి ప్రాజెక్టు పనులపై సందిగ్ధత
- ప్యాకేజీ పనులకు వీడని గ్రహణం
- జిల్లాలో మొదలుకాని సబ్‌మైనర్ పనులు
- నాలుగు ప్యాకేజీలకు రూ.312కోట్లు అవసరం
- పనులు పూర్తయితే 1.06 లక్షల ఎకరాలకు సాగునీరు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు



12వ ప్యాకేజీలో చిప్పలపల్లి వద్ద పూర్తికాని లైనింగ్ పనులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మెట్ట ప్రాంతం రాజన్నసిరిసిల్ల జిల్లాకు గోదావరి జలాలు పూర్తి స్థాయిలో రావడం లేదు. బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు గత ప్రభుత్వం చేపట్టిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పొరుగు జిల్లా అయిన సిద్దిపేట జిల్లాలో ప్యాకేజీ పనులు త్వరగా పూర్తికాగా.. రాజన్నసిరిసిల్ల జిల్లాలో సబ్‌మైనర్ కెనాల్స్ పనులకు శ్రీకారం చుట్టలేదు. జిల్లాలో చేపట్టిన 9, 10, 11, 12 ప్యాకేజీ పనుల్లో భూసేకరణ జరగడమే ఇందుకు నిదర్శనం. మరోవైపు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి, కాంగ్రెస్ సర్కార్ కొలువు దీరడంతో జిల్లాలో పూర్తికాని ఇరిగేషన్ ప్రాజెక్టు పనులపై రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం నిధుల విడుదలను పెండింగ్‌లో పెట్టడంతో కొత్త సర్కార్‌పైనే రూ.312 కోట్ల విడుదలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో నాలుగు ప్యాకేజీలకు రూ.312 కోట్లు ప్రస్తుతం అవసరం ఉంది.

భూసేకరణే అసలు సమస్య

- ఇల్లంతకుంట శివారులో రైతులు కెనాల్ నిర్మాణానికి, డిస్ట్రిబ్యూటరీ పనులకు అభ్యంతరాలు చెబుతున్నారు. వీర్నపల్లిలో అటవీ భూములు ఉండడంతో అటవీశాఖ అభ్యంతరాలు ఉన్నాయి. అల్మాస్‌పూర్ నుంచి రహదారి వెంట ఉన్న భూముల నుంచే మెయిన్, మైనర్ కెనాల్స్ ఉన్నాయి. విలువైన భూములు ఇవ్వలేమని దుమాల, అక్కపల్లి రైతులు పేర్కొంటున్నారు.
- 10వ ప్యాకేజీలో పెద్దలింగాపూర్ పరిసర గ్రామాల్లో సబ్‌మైనర్ కాలువల నిర్మాణానికి భూసేకరణ అడ్డంకిగా మారింది.
- 11వ ప్యాకేజీలో దాచారం, సిరికొండ, జిల్లెల్ల, బద్దెనపల్లి, నర్సింలపల్లిలో భూసేకరణ చేయాల్సి ఉంది.
- 12వ ప్యాకేజీలో ముస్తాబాద్, నామాపూర్, తెర్లుమద్దిలో రైతుల అభ్యంతరాలు ఉన్నాయి. ముస్తాబాద్, నామాపూర్ వద్ద డిస్ట్రిబ్యూటరీలను నిర్మించాలి.
- నాలుగు ప్యాకేజీల్లో ఇంకా 1,743 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. దీనికి రూ.172 కోట్లు అవసరం ఉన్నాయి.



నామాపూర్ వద్ద లైనింగ్‌తో మల్లన్నసాగర్ కెనాల్

ఇరిగేషన్ ప్యాకేజీల స్వరూపం ఇదీ..

- 9వ ప్యాకేజీలో మల్కపేట రిజర్వాయర్ నుంచి ఎగువమానేరు ప్రాజెక్టుకు నీటిని ఎత్తిపోతల ద్వారా తరలిస్తారు. మల్కపేట నుంచి సముద్ర లింగాపూర్ చెరువులోకి, అక్కడి నుంచి నాగంపేట చెరువులోకి లిఫ్ట్ చేసి మానేరుకు తరలిస్తారు. అల్మాస్‌పూర్ చెరువు నుంచి వీర్నపల్లికి నీటిని తరలిస్తారు. అయితే 587 ఎకరాల భూసేకరణ మిగిలి ఉంది. మరో రూ.59కోట్లతో కెనాల్స్, సబ్‌మైనర్లను నిర్మించాల్సి ఉంది. 9వ ప్యాకేజీ పూర్తి కావడానికి రూ.118.31కోట్లు కావాలి. మూడు మండలాల్లో 39,903 ఎకరాలు సాగులోకి వస్తుంది.
- 10వ ప్యాకేజీలో ఇల్లంతకుంట మండలం వస్తుంది. ఇక్కడ 301.23 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. రూ.12.93కోట్లతో నిర్మాణాలు చేపట్టాలి. రూ.38.67 కోట్లు కేటాయిస్తే 15వేల ఎకరాలు సాగులోకి వస్తాయి. 35 చెరువులకు నీటిని సరఫరా చేస్తారు.
- 11వ ప్యాకేజీలో ఇల్లంతకుంటతోపాటు తంగళ్లపల్లి మండలాలు కవర్ అవుతాయి. 728 ఎకరాల భూసేకరణ చేయాలి. కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు రూ.40 కోట్లు అవసరం. మొత్తంగా రూ.112.82కోట్లు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తే 29,828 ఎకరాలు సాగులోకి వస్తాయి.
- 12వ ప్యాకేజీలో 126.11 ఎకరాలు సేకరించాల్సి ఉంది. డిస్ట్రిబ్యూటరీలు, సబ్‌మైనర్ల నిర్మాణానికి రూ.27.26కోట్లు కావాలి. రూ.42.32 కోట్లు మంజూరు చేస్తే 21,976 ఎకరాలు సాగులోకి వస్తాయి. ముస్తాబాద్ మండలంలో 18 చెరువులు, గంభీరావుపేట మండలంలో 12 చెరువులకు నీరు చేరుతుంది.

మొత్తం మీద మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోకి వస్తున్న నాలుగు ప్యాకేజీలలో 1,743.11 ఎకరాల భూసేకరణ చేయాలి. ఇందుకు రూ.172.41కోట్లు కావాలి. కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి రూ.139.66కోట్లు కావాలి. ఇవన్నీ మంజూరై పనులు పూర్తయితే 1,06,707 ఎకరాలు వస్తాయి.

సర్కార్‌పైనే ఆశలు

జిల్లాలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కాలేదు. భూసేకరణ, పనుల జాప్యంతో పెండింగ్‌లో పడ్డాయి. ప్రభుత్వం మారి.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మల్కపేట 9వ ప్యాకేజీ, మల్లన్నసాగర్ 10, 11, 12 ప్యాకేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు. రూ.312.12కోట్లు మంజూరు చేయిస్తే 1,06,707 ఎకరాలు సాగులోకి వస్తాయి.

బాధ్యత పాలకులదే



జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన బాధ్యత పాలకులదే. గత ప్రభుత్వం 9వ ప్యాకేజీ పనుల విషయంలో నిర్లక్ష్యం వహించింది. కేటీఆర్ చొరవ తీసుకుంటే రూ.312 కోట్లు మంజూరయ్యేవి. ఇప్పటికైన కొత్త ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు పూర్తయ్యేలా చూడాలి.

– మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ, ముస్తాబాద్

భూసేకరణ గురించి పట్టించుకోలేదు



పొరుగు జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. కేవలం సిరిసిల్ల జిల్లాలో ఐదేళ్లుగా పనులు పెండింగ్‌లో పెట్టారు. భూసేకరణ గురించి పట్టించుకోలేదు. లేదంటే కెనాల్స్ పూర్తయి నీరు వచ్చేది.

– కొరెడ్ల కొండల్‌రెడ్డి, రైతు, చీకోడు

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..



బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జిల్లాలో లక్షా ఎకరాలు సాగుకు నోచుకోకుండా పోయింది. కేవలం రూ.312 కోట్లు మంజూరు చేయిస్తే పనులు పూర్తయ్యేవి. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చర్చించాం. నిధుల మంజూరుకు విన్నవించాం. మేడిగడ్డ దెబ్బతింది. నీటి లభ్యత కూడా ఉండకపోవచ్చు. పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలి.

–కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి

పారదర్శకంగా వైద్యసేవలు అందించాలి

- రోగులతో మర్యాదగా ప్రవర్తించాలి
- మెటర్నటీవార్డులో సేవలు పెంచాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- జిల్లా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమి

సిరిసిల్లటౌన్: జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు పారదర్శకమైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గురువారం ఆస్పత్రిని అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. మెటర్నటీ వార్డులో సేవలు మెరుగుపర్చాలన్నారు. పేషెంట్లతో ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఔట్‌పేషెంటు కౌంటర్‌ను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆస్పత్రిలోని మందులను పరిశీలించారు. గర్భిణులకు ప్రత్యేకంగా మందుల కౌంటర్ ఏర్పాటు చేయాలని, 40 సీట్ల సామర్థ్యంతో వెయిటింగ్ హాలును ఏర్పాటు చేయాలని, టిఫ్పా స్కానింగ్స్ ఎక్కువ చేయాలని సూచించారు. అవసరమైతే అదనంగా రేడియాలజిస్టును నియమించాలని ఆదేశించారు. చిన్నపిల్లల వార్డులో పలువురిని పలకరించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ సంతోష్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రావు, మున్సిపల్ డీఈఈ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

గైనకాలజిస్టు తీరుపై ఆందోళన

జిల్లా కేంద్రానికి చెందిన ఓ గర్భిణీ ఆస్పత్రికి రాగా.. కడుపులోనే శిశువు మృతిచెందినట్లు సిబ్బంది బంధువులు తెలిపారు. అదే సమయంలో కలెక్టర్ ఆస్పత్రి తనిఖీకి రాగా సదరు వైద్యురాలు గర్భిణీకి అత్యవసరంగా..చికిత్స అందించకుండానే కలెక్టర్ వద్దారని వెళ్లడంపై బంధువులు ఆందోళన చేపట్టారు. ఈమేరకు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. చివరికి కలెక్టర్ వెళ్లాక సదరు వైద్యురాలు వచ్చి చికిత్స అందించడంతో గొడవ సద్దుమణిగింది. ఈవిషయమై జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్‌ను వివరణ కోరగా.. సదరు పేషెంటుకు ఆపరేషన్ నిమిత్తం ఓటీలో ప్రిపరేషన్‌కు సమయం పడుతుందని డ్యూటీ డాక్టర్‌ను పేషెంట్ వద్ద గైనకాలజిస్టు ఉంచారని నిర్లక్ష్యం చేయలేదన్నారు.

వైభవంగా హనుమాన్ ప్రతిష్ఠ వేడుకలు





ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు మూడు రోజులుగా అంగరంగ వైభవంగా కొనసాగాయి. రూ.75 లక్షల వ్యయంతో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. చివరి రోజు గురువారం ఆలయంలో హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. అంతకుముందు గ్రామంలో హనుమాన్ చిత్రపటంతో ర్యాలీ తీశారు. యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, కళాన్యాసం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. పండితులు రాచర్ల రఘురామశర్మ, వేణుగోపాలచార్య, శ్రీనివాసశర్మలు పూజలు చేశారు. ఎంపీపీ పిల్లి రేణుక, ఎంపీడీవో సత్తయ్య, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, వేములవాడ ఈఈ రాజేశ్, ఎంపీటీసీ అపేరా సుల్తానా, మాజీ మంత్రి కేటీఆర్ పీఏలు కుంభాల మహేందర్‌రెడ్డి, ఘన్‌రాజ్, మాజీ సర్పంచులు నిమ్మ లక్ష్మి, దొమ్మాటి నర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు నిమ్మ సుధాకర్‌రెడ్డి, సూర నర్సయ్య, లింగాల నర్సయ్య, లద్దునూరి హన్మండ్లు, శ్రీధర్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లులకు వందనం



వీర్నపల్లి మండలంలో సమ్మక్కను గద్దెకు తీసుకొస్తున్న పూజారులు





ఓగులాపూర్‌లో మొక్కులు చెల్లిస్తున్న ఆది శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, ముస్తాబాద్‌లో పూజలు

- గద్దెలపైన సమ్మక్క–సారలమ్మ

తంగళ్లపల్లి/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి/కోనరావుపేట: వనదేవతల జాతరలో భాగంగా రెండో రోజు గురువారం గద్దెలపైకి సమ్మక్క చేరింది. సమ్మక్క–సారలమ్మ గద్దెలపైకి చేరడంతో భక్తజనం మొక్కులు చెల్లించుకునేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ముస్తాబాద్‌లో గణపతిహోమం నిర్వహించారు. పూజారి పుల్లూరి రాజమల్లయ్య ఇంటి నుంచి కంకవనాన్ని తీసుకొచ్చి గద్దె వద్ద ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో పూజారులు మల్లేశం గుట్ట సమ్మక్క ప్రతిమను డోలువాయిద్యాల మధ్య గద్దెకు చేర్చారు. మహిళలు అమ్మవార్లకు ఓడిబియ్యం సమర్పించారు. శుక్రవారం బోనాలు తీయనున్నారు. ఎంపీటీసీ ఇల్లందుల గీతాంజలి పాల్గొన్నారు. తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లో అమ్మవార్లను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ దర్శించుకున్నారు. ఎంపీపీ పడిగెల మానస, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఉమ్మడి కరీంనగర్ మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. వీర్నపల్లి మండలం శాంతినగర్, బాబాయిచెరువు గ్రామాల్లో సమ్మక్క గద్దెలపైకి వచ్చారు. ఎంపీటీసీ బానోత్ పద్మ, బానోత్ రాజు, గన్య, నాజం, భరత్ పాల్గొన్నారు. కోనరావుపేట మండలం శివంగాలపల్లిలో సమ్మక్క గద్దెకు చేరింది.

మొక్కు చెల్లించిన ప్రభుత్వ విప్

తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ సమ్మక్క–సారలమ్మలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీటీసీ పూర్మాని మంజులతో కలిసి ఆలయ తోరణాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రవీణ్ జె.టోని, నాయకులు పూర్మాని రాంలింగారెడ్డి, వైద్య శివప్రసాద్ ఉన్నారు.



ముస్తాబాద్‌లో కంకవనంతో పూజారులు



రాచర్లబొప్పాపూర్‌లో..

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

- అదనపు కలెక్టర్ పూజారి గౌతమి
- సీడీఎంఏ నుంచి డైరెక్టర్ దివ్య దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతమి

సిరిసిల్ల: తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి కోరారు. కలెక్టరేట్‌లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ అధికారులతో గురువారం సమీక్షించారు. వేసవి సమీపిస్తున్నందునా నీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటిట్యాంక్‌ల నుంచి ఇంటింటికీ నీటి సరఫరాలో లోపాలు ఉంటే సవరించాలని సూచించారు. పైప్‌లైన్ లేని వారికి, గుడారాలు వేసుకొని నివసించే వారికి సైతం తాగునీరు చేరాలన్నారు. బస్‌స్టాండ్, మార్కెట్, ఇతర రద్దీ ప్రాంతాల్లో తాగునీటి వసతి కల్పించాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు నిత్యం చేయించాలని, ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించాలని తెలిపారు. అంతకుముందు వేసవిలో మున్సిపాలిటీలలో చేపట్టాల్సిన పనులపై హైదరాబాద్ సీడీఎంఏ నుంచి డైరెక్టర్ దివ్య దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పక్షుల కోసం నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

పోడుభూముల పట్టాలు ఇస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమావేశమైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: గిరిజనులకు పోడు భూముల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పట్టణంలని మల్లారంరోడ్డులో గురువారం నిర్వహించిన సంత్ సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధికి సంత్ సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి గొప్పదన్నారు. సేవాలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఆర్డీవో మధుసూదన్, తహసీల్దారు మహేశ్, కౌన్సిలర్లు బింగి మహేశ్, ఇప్పపూల అజయ్, నాయకులు ఈర్యా నాయక్, గిరిజనులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ ఆవిష్కరణ

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం డైరీని ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. దాసరి దేవేందర్, దండి సంతోష్, పుట్టపాక లక్ష్మణ్, మహేశ్, రేగుల దేవేందర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య జఠిలం కావొద్దు

వేములవాడ నియోజకవర్గంలో తాగునీటి సమస్య జఠిలం కావొద్దని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. వేములవాడలోని మల్లారంరోడ్డు నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి సభకు హాజరై మాట్లాడారు. ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమావేశమయ్యారు. కొత్తగా ఏర్పడిన భీమారం మండలంలో సిబ్బంది కొరత, వారికి రావాల్సిన వేతనాలపై సంబంధితశాఖ మంత్రితో మాట్లాడారు. నియోజకవర్గంలో తాగునీటి ఇబ్బందులు ఉండొద్దన్నారు. ఇప్పటికే మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. త్వరలోనే దీనిపై అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆర్డీవో మధుసూదన్‌ను ఆదేశించారు. గృహ అవసరాలకు ఇసుకను ఇవ్వాల్సిందేనని అధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన సర్టిఫికెట్లపై అధికారులు ఇబ్బందులు కలిగించొద్దని ఆదేశించారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత మూడు రోజుల్లోగా సర్టిఫికెట్లు జారీకావాలన్నారు.

క్లుప్తంగా

24 నుంచి టెక్నికల్ కోర్సులకు పరీక్షలు

సిరిసిల్లఎడ్యుకేషన్: డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, లోయర్, హయర్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు ఈనెల 24 నుంచి 27 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తెలంగాణ పరీక్షల విభాగం వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీలకు వెంకంపేట హైస్కూల్‌లో పరీక్షలు ఉంటాయని, అభ్యర్థులు కుట్టు మిషన్‌ను వెంట తీసుకురావాలని సూచించారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్ అభ్యర్థులకు అంబేడ్కర్‌నగర్ హైస్కూల్‌లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

మార్కెటింగ్‌లో ఉద్యోగావకాలు

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలోని శ్రీరామ్ ఫైనాన్స్, ఇన్సూరెన్స్ కంపెనీలో ఖాళీగా ఉన్న మార్కెటింగ్ ఉద్యోగాల భర్తీకి శనివారం మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై 35 ఏళ్లలోపు నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ప్రతీ నెల రూ.10వేల నుంచి రూ.16వేల వేతనం లభిస్తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ ప్రతులతో కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 99121 78932లో సంప్రదించాలని కోరారు.

ఆలోచనలకు పదును

సిరిసిల్లఎడ్యుకేషన్: చిన్నారుల ఆలోచనలకు పదును పెడుతూ పరిశోధనలకు అడుగులు వేసేలా సిరిసిల్లలోని కుసుమ రామయ్య హైస్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో వర్క్‌షాప్ కొనసాగుతోంది. 52 మంది విద్యార్థులకు రోబోటిక్స్ కోడింగ్ సెన్సార్ల వినియోగంపై శిక్షణ ఇస్తున్నారు. శిక్షకుడు ప్రేమ్, హెచ్‌ఎం మోతిలాల్, ల్యాబ్ ఇన్‌చార్జి శంకర్‌గౌడ్, టీచర్లు సరిత, శ్రీహరి, రజిత ఉన్నారు.

ఒకరి మృతికి కారణమైన డ్రైవర్ అరెస్టు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని నామాపూర్ వద్ద ట్రాలీ ఆటో బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరి మృతికి కారణమైన తుర్కపల్లికి చెందిన డ్రైవర్ ఆనంద్‌ను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన దమ్మన్నపేట నర్సింలు(51) మృతిచెందగా, ఆయన సోదరుడు దమ్మన్నపేట దేవయ్య తీవ్రంగా గాయపడ్డట్లు తెలిపారు. నర్సింలు మృతికి కారణమైన డ్రైవర్ ఆనంద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోరుట్లరూరల్: పట్టణ శివారులోని బొమ్మెన రోడ్డు క్రాసింగ్ వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీకొనటంతో కొమురవెల్లి రాకేశ్(32) అక్కడికక్కడే మృతి చెందాడు. పనినిమిత్తం రాకేశ్ గురువారం రాత్రి జగిత్యాల వెళ్లి వస్తున్నాడు. బొమ్మెన వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద నాగులపేటకు చెందిన ఇసుక ట్రాక్టర్ జగిత్యాల వైపు వస్తూ.. రాకేశ్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

విత్తన నిల్వలు ఆన్‌లైన్

- ఫాం–డీని తెరపైకి తెచ్చిన ప్రభుత్వం
- కల్తీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకే..
- డీలర్లు వివరాలు నమోదు చేయాల్సిందే
- కరీంనగర్ జిల్లాలో 4 వ్యవసాయ డివిజన్లు



ఫాం–డీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

కరీంనగర్ అర్బన్: కల్తీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం సరికొత్త పంథాలో ముందుకుసాగుతోంది. లైసెన్స్‌డ్ విత్తన డీలర్లు అక్రమ నిల్వలు చేయకుండా ఉన్న నిల్వల సమాచారం పక్కాగా ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా ఫాం–డీని తెరపైకి తెచ్చింది. రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ సైట్‌లో సదరు వివరాలతో వింగ్ ఏర్పాటు చేయగా అందులో విత్తన డీలర్లందరూ వివరాలు నమోదు చేయడం తప్పనిసరి. ఇప్పటికే కరీంనగర్ జిల్లాలోని డీలర్లకు అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్ పర్యవేక్షణ చేస్తుండగా మండలాల వ్యవసాయ అధికారులు డీలర్లకు ఐడీ, లాగిన్ క్రియేట్ చేశారు. వివరాలను నమోదు చేసేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. సాంకేతిక వ్యవసాయ అధికారి కృష్ణ సాంకేతికంగా ఏర్పడే సమస్యలను పరిష్కరిస్తున్నారు.

ప్రతి నెలా 5లోగా నమోదు

ఏ కంపనీ విత్తనాలు ఎన్ని ఉన్నాయి, ఏయే రకాల విత్తనాలు, లాట్ నంబర్, కంపనీ వివరాలు, విక్రయించింది ఎంత, ఉన్న నిల్వ ఎంతనేది ప్రతి నెలా 5వ తేదీలోగా సైట్‌లో పొందుపరచాలి. విత్తన డీలర్ పరిధిలో ఎన్ని క్వింటాళ్లు, ఏయే విత్తనాలు ఉన్నాయో క్వింటాళ్లలో నమోదు చేయాలి. జిల్లాలో 465 మంది డీలర్లు ఉండగా ప్రధానంగా పత్తి, వరి, మొక్కజొన్న, జొన్న, పెసలు, కందులు, మినుములు, కూరగాయలు తదితర విత్తనాలు విక్రయిస్తున్నారు. కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, గంగాధర, మానకొండూరు, శంకరపట్నం, కొత్తపల్లి, తిమ్మాపూర్ మండలాల్లో ఎక్కువ మంది డీలర్లు ఉండగా, హోల్‌సేల్ డీలర్లు కరీంనగర్, హుజూరాబాద్‌లో ఉన్నారు.

మండలాల వారీగా విత్తన దుకాణాలు

కరీంనగర్ అర్బన్‌లో 65, కరీంనగర్ రూరల్ 19, కొత్తపల్లి 18, చొప్పదండి 24, రామడుగు 35, గంగాధర 36, మానకొండూరు 19, శంకరపట్నం 16, గన్నేరువరం 25, తిమ్మాపూర్ 22, చిగురుమామిడి 39, హుజూరాబాద్ 23, జమ్మికుంట 53, వీణవంక 27, ఇల్లందకుంట 23, సైదాపూర్ 21.

నిఘా బృందం ఆకస్మిక తనిఖీలు

కరీంనగర్ జిల్లాలో 313 గ్రామాలుండగా సాగు విస్తీర్ణం 3,33231 ఎకరాలు. రైతులు 1,83,209 మంది రైతులు ఉన్నారు. కరీంనగర్, మానకొండూరు, హుజూరాబాద్, చొప్పదండి వ్యవసాయ డివిజన్లు ఉన్నాయి. కరీంనగర్‌లో 102, హుజూరాబాద్‌లో 147, మానకొండూరులో 121, చొప్పదండిలో 95 మంది విత్తన డీలర్లు ఉన్నారు. ఏటా కల్తీ విత్తనాల విక్రయాలు పెచ్చుమీరుతుండగా పోలీసు, వ్యవసాయ శాఖలు కేసులు నమోదు చేస్తున్నాయి. పత్తి, మొక్కజొన్న నాసిరకం విత్తనాలు సరఫరా చేస్తుండగా ఈ ప్రక్రియతో దాదాపు సగం కల్తీని నిలువరించినట్లే. ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయడం వల్ల రాష్ట్రస్థాయిలోని నిఘా బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించనుంది. మిగతా విత్తనాలు కనిపిస్తే కఠినంగా వ్యవహరించనున్నారు. అవసరమైతే జైలుకు పంపే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇక, విత్తన డీలర్లు కాకుండా ఇతర వ్యాపారులు విత్తనాలు విక్రయించినా లైసెన్స్ లేదనేది వెబ్‌సైట్ ద్వారా ఇట్టే తెలిసిపోనుంది. జిల్లా వ్యవసాయ శాఖతో సంబంధం లేకుండా ఏ జిల్లా అధికారులైనా తనిఖీలు చేయొచ్చని స్పష్టమవుతోంది. సాగు విస్తీర్ణం క్రమంలో ఏయే విత్తనాలు వేస్తున్నారు, ఎంత వేశారు, ఏ విత్తనాలు మిగిలాయన్నా వివరాలు సులువుగా తెలుస్తాయి.

ప్లాస్టిక్ వ్యర్థాలు కాల్చి.. బూడిదగా మార్చి..

- ప్లాస్మిక్ కోర్ ఇన్సినరేటర్ ట్రయల్ రన్ సక్సెస్



ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో ఎట్టకేలకు ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేసి బూడిదగా మార్చే ప్లాస్మిక్ కోర్ ఇన్సినరేటర్ యంత్రానికి గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. పట్టణ ప్రగతి నిధులు రూ.39లక్షల వ్యయంతో మూడేళ్ల క్రితం కొనుగోలు చేసిన ఈ యంత్రాన్ని ఒక్కరోజు కూడా వాడకుండానే నిరుపయోగంగా మార్చారు. దీనిపై ‘సాక్షి’లో వరుసగా కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. ‘లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు..’ అనే శీర్షికను ‘సాక్షి’ మూడు నెలల క్రితం ప్రచురించడంతో మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించారు.

తక్కువ విద్యుత్‌తో..

ఇటీవల కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ సైతం ఈ యంత్రాన్ని స్వయంగా పరిశీలించారు. యుద్ధప్రాపతిదికన యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో స్థానిక గౌతమినగర్ డ్రై రీసోర్స్ సెంటర్‌లో ఉన్న ప్లాస్మిక్ కోర్ ఇన్సినరేటర్ యంత్రానికి మున్సిపల్ కమిషనర్ సమక్షంలో గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. ప్లాస్మిక్ కోర్ ఇన్సినరేటర్ యంత్రం సంతృప్తికరంగా పని చేస్తుండడంతో, త్వరలో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని కమిషనర్ తెలిపారు. తక్కువ విద్యుత్ వినియోగించుకొని ఈయంత్రం రోజుకు 750 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను బూడిద చేస్తుందని కమిషనర్ వెల్లడించారు. చెత్త రీసైక్లింగ్ చేయడంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ యంత్రం ద్వారా వెలువడిన బూడిదతో, ఇటుకలు తయారు చేసుకొని ఉపయోగించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఏఈ షాభాజ్, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్, ఏఈ ఎలెక్ట్రికల్ రాంజీ, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద కుటుంబాలకు రూ.లక్షన్నర అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న అశోక్‌రావు

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ అగ్ని ప్రమాద కుటుంబాలకు 42వ డివిజన్ కార్పొరేటర్ మేచినేని వనజ భర్త అశోక్‌రావు గురువారం రూ.లక్షన్నర ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సూచన మేరకు సాయం అందించామన్నారు. బాధితులు అధైర్యపడవద్దని, ప్రస్తుతం ఉంటున్న చోటనే నివాసం ఉండేలా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడతామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావులతోపాటు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చొప్పదండి: బీరువాను తెరిచిన దొంగలు

చొప్పదండి: పట్టణంలోని శ్రీరామా టాకీస్ ఏరియాలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. గంగపుత్ర సంఘం సమీపంలో నివాసం ఉండే బట్టు శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో మూడు రోజుల క్రితం షోలాపూర్‌కు పెళ్లి నిమిత్తం వెళ్లారు. బుధవారం రాత్రి స్వస్థలం చొప్పదండిలోని ఇంటికి రాగానే గేటు తాళం వేసి ఉంది కానీ ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని బీరువా పగుల గొట్టి, బట్టలు చిందర వందరగా ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సుమారు రూ. 80 వేల విలువైన వెండి, బంగారం చోరీ చేశారని తెలిపాడు. వరుస చోరీ ఘటనల నుంచి ఇటీవల పట్టణ ప్రజలు ఉపశమనం పొందగా మళ్లీ చోరీ సంఘటనతో పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు.

పోయిందనుకున్న నెక్లెస్ దొరికిందోచ్..

- అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు
- డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్‌తో వచ్చిన పోలీసులు
- ఇంట్లోనే దొరికిన ఆభరణం



బంగారు నెక్లెస్‌తో ఎస్సై శ్రీకాంత్

బోయినపల్లి(చొప్పదండి): నెక్లెస్ కనిపించడం లేదని మండలంలోని నీలోజిపల్లికి చెందిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తీరా ఇంట్లోనే దొరకడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఇంట్లోనే నగ పెట్టుకొని పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడం అంతటా చర్చనీయాంశమైంది. మండలంలోని నీలోజిపల్లికి చెందిన ఎల్లవ్వ బుధవారం నిమ్మపల్లిలో ఓ వివాహానికి బంగారు నెక్లెస్ ధరించి వెళ్లింది. ఇంటికొచ్చిన తర్వాత నెక్లెస్ తీసి ఇంట్లోని సెల్ఫ్‌లో దాచిపెట్టింది. తీరా గురువారం నెక్లెస్ చూస్తే కనిపించకపోవడంతో దొంగతనం జరిగిందనే అనుమానంతో ఆమె భర్త నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై శ్రీకాంత్ డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ బృందాలతో వచ్చి గురువారం రాత్రి ఎల్లవ్వ ఇంట్లో వెదికారు. ఇంట్లోనే బంగారు నెక్లెస్ దొరికింది.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

కరీంనగర్‌క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ ఆటోడ్రైవర్ మృతిచెందినట్లు కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని హుస్సేనిపురకు చెందిన ఎండీ.అఫ్జలొద్దీన్(45) ప్రతిరోజూ తన ఆటోలో మెడికల్ విద్యార్థులను కాలేజీకి తీసుకెళ్తాడు. గురువారం ఉదయం తీసుకెళ్తుండగా డాక్టర్స్ స్ట్రీట్‌లో ఓ వాహనం అడ్డు వచ్చింది. దాన్ని తప్పించబోయి మధ్యలో ఉన్న ట్రాఫిక్ స్టాండ్‌కు ఢీకొట్టాడు. ఈ ఘటనలో అఫ్జలొద్దీన్ తలకు తీవ్ర గాయాలవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో వైద్య సిబ్బందికి గాయాలు



గాయపడ్డ అభిషేక్, నీలోఫర్

చందుర్తి(వేములవాడ): వైద్య పరీక్షలు చేయించుకున్న కార్మికులకు మందులు పంపిణీ చేసి తిరిగి వస్తుండగా చందుర్తి మండలం బండపల్లి–ఎన్గల్ గ్రామాల మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. జిల్లా కేంద్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ శాఖలో అభిషేక్, నీలోఫర్ ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్నారు. బండపల్లిలోని కార్మికులకు గురువారం మందులు పంపిణీ చేసి తిరిగి వస్తున్నారు. ఆ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారుకు సైడ్ ఇవ్వబోగా.. వీరి బైక్ అదుపుతప్పి, పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. గాయపడ్డ ఇద్దరిని సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని నామాపూర్, చీకోడుల మధ్య గురువారం రాత్రి బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చీకోడుకు చెందిన గొట్టె కిష్టయ్య తన బైక్‌పై నామాపూర్ నుంచి చీకోడు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలైన కిష్టయ్యను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శివారులోని సిరిసిల్ల– వేములవాడ రహదారిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన బారికేడ్లను బైక్‌తో ఢీకొని అగ్రహారానికి చెందిన విష్ణుప్రసాద్ గాయపడ్డాడు. విష్ణుప్రసాద్‌ను 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఒకరి ఆత్మహత్య



రాజన్న మృతదేహం

ధర్మపురి: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిన్ననక్కలపేట గ్రామంలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోర్లకుంట రాజన్న (50)కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. ఆయన బాగోగులు సోదరుడు పెద్ద పోశం చూసుకుంటున్నాడు. గురువారం ఉదయం పోశం ధర్మపురి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారకమందు తాగాడు. గమనించిన బంధువులు పోశంకు సమాచారమిచ్చారు. ఆయన వచ్చి చూసేసరికి చనిపోయి ఉన్నాడు. పోశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజు తెలిపారు.

గుండెపోటుతో వలసజీవి మృతి

కోరుట్ల: పట్టణానికి చెందిన గల్ఫ్ కార్మికుడు అంబల్ల స్వామిదాసు (45) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. కొంతకాలంగా సౌదీఅరేబియా వెళ్లి వస్తున్న స్వామిదాసు.. రెండు నెలల క్రితం సెలవుపై ఇంటికి వచ్చాడు. మరో రెండురోజుల్లో మళ్లీ సౌదీ వెళ్లేందుకు విమానం టికెట్ బుక్ చేసుకున్నాడు. ఇంతలోనే గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మిస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- చందుర్తి–మోతుకురావుపేటల మధ్య రోడ్డు పరిశీలన
- మహాశివరాత్రి కోసం తాత్కాలిక ఏర్పాట్లు



చందుర్తి–మోతుకురావుపేట రోడ్డును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): చందుర్తి–మోతుకురావుపేట గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో శాశ్వత రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. వేములవాడ రాజన్న సన్నిధిలో జరిగే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ రోడ్డును తాత్కాలికంగా మరమ్మతు చేస్తున్నారు. ఈ పనులు గురువారం పరిశీలించి మాట్లాడారు. మేడిపల్లి, రాయికల్, భీమారం మండలాల భక్తులకు దూర భారం తగ్గించేందుకు చేస్తున్న రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఆర్టీసీ బస్సులను నడిపించేందుకు కోరుట్ల, వేములవాడ, జగిత్యాల డిపో మేనేజర్లను కోరనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అటవీ ప్రాంతంలో నిలిచిన మూడున్నర కిలోమీటర్ల రోడ్డుకు అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. చందుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జిల్లా కార్యదర్శి గొట్టె ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

జిల్లాలో కుష్ఠు నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న లెప్రసీ రాష్ట్ర ప్రత్యేకాధికారి సకలారెడ్డి

సిరిసిల్లటౌన్: కుష్ఠు వ్యాధి సంపూర్ణ నిర్మూలన దిశగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టిందని లెప్రసీ రాష్ట్ర ప్రత్యేకాధికారి సకలారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని ఇల్లంతకుంట, నేరెళ్ల, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో గురువారం అధికారులతో సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో 14 రోజులపాటు ఇంటింటా ఎల్‌డీసీసీ సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు, గుర్తించే పద్ధతులు వివరించారు. ప్రాథమిక దశలోనే కుష్ఠు వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. రాష్ట్ర బృందం సభ్యులు వెంకటేశ్వరచారి, జిల్లా డీపీఎంవో రేపూరి కాశీనాథం, చేపూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరెళ్ల పీహెచ్‌సీలో రాష్ట్ర బృందం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని నేరెళ్ల పీహెచ్‌సీని గురువారం రాష్ట్ర కుష్ఠువ్యాధి నివారణ బృందం సభ్యులు పరిశీలించారు. బృందం సభ్యులు మాట్లాడుతూ కుష్ఠువ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యల గురించి వైద్య సిబ్బందికి వివరించారు. కుష్ఠువ్యాధి లక్షణాలను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే చికిత్స అందించి అంగవైకల్యం రాకుండా కపాడవచ్చన్నారు. బృందం సభ్యులు వెంకటేశ్వరాచారి, సాకేత్‌రెడ్డి, అరుణ, శారద, డిప్యూటీ డీఎంహెచ్‌వో కాశీనాథం, శ్రీనివాసస్వామి, సురేష్, పీహెచ్‌సీ మెడికల్ అధికారి రేఖ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నార్మల్ డెలివరీలపై నిర్లక్ష్యం చేయొద్దు

- ప్రైవేటు ఆస్పత్రుల తీరు మార్చుకోవాలి
- బాలింతల ఆరోగ్యానికే ప్రాధాన్యత ఇవ్వాలి
- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రజిత



సమీక్షిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రజిత

సిరిసిల్లటౌన్: నార్మల్ డెలివరీలు చేయడంపై ప్రైవేటు ఆస్పత్రులు నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రజిత హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో మొదటి కాన్పుల్లో ఎక్కువగా ఆపరేషన్లు చేస్తున్నారని, ఈ పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ఈవిషయమై గతంలో ప్రైవేటు ఆస్పత్రుల గైనకాలజిస్టులతో చర్చించామని, ఎవరైతే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో వారి ఆస్పత్రుల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు పొందాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇబ్బందులు ఎదురైతే 98665 03107లో సంప్రదించాలన్నారు.

వైద్యారోగ్య కార్యక్రమాలపై సమీక్ష

డీఎంహెచ్‌వో ఆఫీస్‌లో వైద్యారోగ్య శాఖ నిర్వహించే అన్ని కార్యక్రమాలపై డాక్టర్ రజిత సమీక్షా సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలకు దిశా నిర్దేశం చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీరాములు, వైద్యులు నయీమ, రాజ్‌కుమార్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

సిరిసిల్లటౌన్: జిల్లాలో పనిచేస్తున్న పలువురు డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లారెడ్డిపేట డీటీ ఎ.జయంత్‌కుమార్‌ను కోనరావుపేటకు.. అక్కడ పనిచేస్తున్న బి.సత్యనారాయణను ఎల్లారెడ్డిపేటకు, ముస్తాబాద్ డీటీ కె.సురేష్‌కుమార్‌ను ల్యాండ్ అక్విజేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా.. అక్కడ పనిచేస్తున్న డి.మారుతిరెడ్డిని ముస్తాబాద్‌కు, ఆర్డీవో ఆఫీసులో పనిచేస్తున్న కె.మనోహర్‌ను సివిల్ సప్లయీస్ డీటీగా.. అక్కడ పనిచేస్తున్న కె.నవీన్‌కుమార్‌ను సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌కు, సిరిసిల్ల డీటీ వి.మురళీకృష్ణను ఎన్నికల డీటీగా కలెక్టరేట్‌కు బదిలీ చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



ఖదీర్ మృతదేహం

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండలం బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద గురువారం లారీ ఢీకొని పెద్దపల్లికి చెందిన ఎంఏ ఖదీర్ (52) దుర్మరణం చెందాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి వివరాల ప్రకారం.. ఖదీర్ రామగుండంలోని సబ్‌ట్రెజరీ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం స్కూటీపై విధులకు వెళ్తుండగా టోల్‌ప్లాజా వద్ద లారీ ఢీకొనడంతో సమీపంలో రహదారి పక్కన పార్కింగ్ చేసి ఉన్న మరో లారీకి ఖదీర్ తగిలి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ఖదీర్‌ను ఢీకొట్టిన లారీ ఆగకుండా వెళ్లిపోయింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని టోల్‌ప్లాజా, కేఎఫ్‌టీ సంస్థకు సంబంధించిన సీసీ ఫుటేజీలను పరిశీలించారు. వాటి ఆధారంగా లారీని గుర్తించారు. ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి బూడిద లోడుతో కరీంనగర్ వైపు వస్తుండగా లారీని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి సోదరుడు జావిద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

లారీల పార్కింగ్‌తో ప్రమాదాలు

కన్నాల టోల్‌ప్లాజా వద్ద రహదారికి ఇరువైపులా ఇష్టారీతిగా లారీలను పార్కింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సాధారణంగా టోల్‌ప్లాజా వద్ద నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. రద్దీ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా పదుల సంఖ్యలో లారీలను వరుసగా నిలిపివేస్తుండటంతో ఇతర వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి టోల్‌ప్లాజా ప్రాంతంలో లారీలను పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నాటకరంగ ప్రముఖుడు రాజేశం మృతి



రాజేశం (ఫైల్)

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న నాటక రంగ ప్రముఖుడు మ్యాడారం రాజేశం(65) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కోనరావుపేట మండలంలోని కనగర్తికి చెందిన రాజేశం వృత్తి రీత్యా లోయర్ మానేరు డ్యాం క్యాంపులో ట్రేసర్‌గా, డ్రాఫ్ట్‌మెన్‌గా, జేటీవోగా పని చేశారు. నాటక రంగంపై ఆసక్తితో నాలుగు దశాబ్దాలుగా ఎల్‌ఎండీలో తిమ్మాపూర్ గ్రామ నవోదయ సమితి కళాకారులతో, నీటిపారుదల శాఖ ఉద్యోగి గోపన్నతో కలిసి శ్రీవేంకటేశ్వర కళాసమితిని ప్రారంభించారు. అప్పటి నాటక కళాకారులు గోపన్న, నారాయణ, జ్ఞానేశ్వర్, కనకమూర్తిలతో కలిసి ఎల్‌ఎండీ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో నాటకాలు ప్రదర్శించారు. ఎల్‌ఎండీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ప్రతీ దసరాకు రావణ వధ కార్యక్రమం నిర్వహించారు. అప్పటి నీటి పారుదల శాఖ ఉద్యోగి, తిమ్మాపూర్‌కు చెందిన ప్రస్తుత సినీ, టీవీ నటుడు కేతిరెడ్డి మల్లారెడ్డి, హనుమంతరావు, ఎం.రాజు, పబ్బ రాజమౌళి, అడిశర్ల సత్యనారాయణ, రాజేశ్వరరావు, స్వామి తదితరులతో కలిసి అక్షర ఉజ్వల, కళాజాతలు, బ్రహ్మోత్సవాలు, బతుకమ్మ ఉత్సవాల్లో అనేక నాటికలు ప్రదర్శించారు. అనేక షార్ట్ ఫిలింస్‌లో నటించారు. జేటీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, జిల్లా సాంస్కృతిక సంస్థల, కళాకారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. రాజేశం మృతి పట్ల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వైఎస్.శర్మ, గజ్జె లక్ష్మణ్, కుమార్ మహర్షి, వై.అనిల్‌కుమార్ గౌడ్, కృపాదానం, రఘువీర్‌సింగ్, సంగెం రాధాకృష్ణ, కేతిరెడ్డి మల్లారెడ్డి, జె.రతన్‌కుమార్, రొడ్డ యాదగిరి, మంచాల రమేశ్, ఎం రాజేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు.